క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం



మేడూరులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీల్ కుమార్

చింతపల్లి: మండలంలో లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని మేడూరు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చింతర్ల సునీల్ కుమార్ గురువారం భూమి పూజచేసి ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6 లక్షలతో ఈ నిర్మాణ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. పంచాయతీ వైస్ సర్పంచ్ ప్రసాద్, వార్డు మెంబర్లు నీలమ్మ, లూతే గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మన సేవా సొసైటీ సభ్యులు

చింతపల్లి: మండలంలోని దామనాపల్లి పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టింది. గ్రామంలో సుమారు వంద మంది నిరుపేదలకు మన సేవా సంస్థ ప్రతినిధులు స్థానిక గిరిజనులకు నిత్యావసర సరకులు, దుస్తులు ఇతరత్రా సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి పెదిరెడ్ల గౌతమ్, నరేంద్ర మహర్షి సభ్యులు జస్వంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సర్వీసెస్ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గంతో సహచార ఉద్యోగులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం పాడేరు డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో పాడేరు యూనిట్ అధ్యక్షుడిగా ఎస్.ప్రకాశరావు, కార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఎస్.నాగేశ్వరావులు ఎన్నికయ్యారు. వారికి సహచార ఉద్యోగులు, పలువులు అబినందనలు తెలిపారు.

గ్రామాల్లో ట్రైకార్ బృందం పర్యటన



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్లు

గంగవరం : మండలంలోని బయనపల్లి, రామవరం, కొత్తాడ గ్రామాల్లో గురువారం రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్లు కృష్ణారావు, పువ్వల లావణ్య, అనురాధ తదితరులు పర్యటించారు. కొత్తాడ, భయ్యనపల్లి గ్రామాల్లో మినీ గోకులాలను, ఉపాధి గ్రూపులను ఈ బృందం సందర్శించింది. గిరిజన రైతులతో వారు మాట్లాడారు. మినీ గోకుల నిర్మాణాలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఉపాధి ఏపీవో ప్రకాశ్, నాయకులు తీగల ప్రభ, సిద్దూ, వెంకటేశ్వర్లు, బుల్లికొండలున్నారు.

ముమ్మరంగా వరి కోతలు



యంత్రం సహాయంతో వరి కోత పనులు

రాజవొమ్మంగి: మన్యంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల తుపాను వాతావరణం, చెదురుమదురు వానలకు వరి పంటను కాపాడుకోడానికి గిరిజన రైతులు బెంబేలెత్తారు. ఈదురుగాలులు తగ్గడంతో యంత్రాలతో కోత పనులు వేగవంతం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 6, 231 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇప్పటి వరకు వరకు 2,200 ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు.

శీతాకాలం.. వ్యాధుల గాలం

- దట్టంగా కురుస్తున్న మంచు
- పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో శీతాకాలం మొదలు కావడంతో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతూ ఉంటుంది. శీతల గాలులకు తోడు తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మంచు విపరీతంగా కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతుంటాయి. అప్రమత్తంగా లేకుంటే సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు మంచులో తిరగకూడదని వైద్యులు సూచనలిస్తున్నారు.

శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నెలల బిడ్డలు తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.
- ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. చలితో ఫిట్స్ వచ్చే ప్రమాదముంది.
- ప్రయాణాల్లో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.



మంచులో వ్యవసాయ పనుల్లో రైతులు



మంచులో వెళ్తున్న యువకులు

- అస్తమా రోగులు ఆయాసం రాకుండా ముందే మందులు వేసుకోవాలి. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలి. చలిలో తిరగడం, చల్లటి నీరు తాగడం చేయకూడదు.
- ఉదయం వాకింగ్ వెళ్లేవారు మఫ్లర్, స్వెటర్‌తో పాటు షూ వేసుకోవాలి. చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- వ్యాయామం చేయడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. చెమట బయటకు వచ్చి చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- విటమిన్–సి లభించే జామ, ఉసిరి, నిమ్మ, ద్రాక్ష, క్యాబేజీ, క్యాప్సికం, టమాట వంటివి తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్నవారు పాదాలు పగలకుండా బూట్లు వేసుకోవాలి.గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు విధిగా మందులు వాడాలి.

ఆరోగ్య రక్షణ అవసరం



శీతాకాలంలో ఆరోగ్య రక్షణలో జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాలు, గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్తమా, శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు నిద్రించే గదిలో తగినంత వేడి ఉండేలా చూసుకోవాలి. ఐదేళ్లలోపు పిల్లలకు స్వెట్టర్లు, ఉన్ని దుస్తులు వేయాలి. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– ఎస్.రమేష్, వైద్యాధికారి, కిలగాడ పీహెచ్‌సీ, ముంచంగిపుట్టు మండలం

యాగశాల నిర్మాణానికి భూమిపూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం సీలేరులోని ఉమా మహేశ్వర ఆలయం ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో యాగశాల నిర్మాణానికి గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ శాస్త్రి, రామాచారి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, జెన్‌కో ఇంజినీర్లు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు ఆలయ కమిటీ తీసుకున్నారు.

గిడ్డి ఈశ్వరి తీరుపై ధ్వజం

చింతూరు: ఆదివాసీ జేఏసీ నాయకులపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఆదివాసీ జేఏసీ డివిజన్ కన్వీనర్ జల్లి నరేష్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గిరిజనేతరులకు ప్రతినిధిగా వ్యవహరిస్తూ ఆదివాసీలకు గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు అండగా నిలువకుండా గిరిజనేతరులకు అండగా నిలవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

గిరిజన విద్యార్థుల మరణాలు కూటమి ప్రభుత్వ వైఫల్యమే

వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

పాడేరురూరల్(అరకులోయరూరల్): గిరిజన విద్యార్థుల మరణాలు కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువాం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాలు, కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై నిజ నిర్ధారణ చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎపుడు ఏ సమయంలో విద్యార్థులు మృత్యువాత పడతారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక మంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారన్నారు. కాని నేటి వరకు ఎందుకు మరణించారో కూడా ప్రభుత్వం నిర్ధారణ చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలే కారణంగానే వరుస మరణాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అరకు, పాడేరు, నియోజకవర్గల పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులపై హత్యాచారలు, లైంగిక దాడులు జరుగుతున్న యాజమాన్యాలు, నిర్వాహకులపై కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఇటువంటి సంఘటనలతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల మరణాలు, అత్యాచార, లైంగిక దాడులపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, విద్యార్థినులపై లైంగిక దాడులు, అత్యాచార, హత్యాచార సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, రైతులను మోసం చేశారని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు అన్నారు. మండల కేంద్రంలోని గురువారం జరిగిన కార్యక్రమంలో వారు అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. అలాగే ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు కలసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాకినాడ కలెక్టరేట్ ఎదుట రైతులకు మద్దతుగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం మురళీ, గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, బేబీరత్నం, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్, పండుదొర, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వలీ, నాయకులు జల్లేపల్లి రామన్నదొర, పండా రామకృష్ణదొర, బొబ్బా శేఖర్, కన్నబాబు, లాలీ తదితరులు పాల్గొన్నారు.

169 మందికి వైద్య పరీక్షలు



లంబసింగి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లి; లంబసింగిలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రాతీయ ఆరోగ్య పరిశోధన సంస్థ విజయవాడ, కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్, ఆయూష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన 169 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెల ఏడు గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. లంబసింగి, కొలపరి, వంగసార, అన్నవరం, మేడూరు, బైలుకించంగి తదితర గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ అనిమోల్, డాక్టర్ కె.నిషాంత్, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సిడీపీవో శారద

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాల్య వివాహాల అనర్థాలపై అరకులోయ సీడీపీవో శారద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు వైస్ ప్రిన్సిపాల్ కె.పుష్పరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు.

బాల్య వివాహాలపై విద్యార్థుల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనిత కుమారి తదితరులు పాల్గొన్నారు. సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థి కె.నాగరాజు ప్రతిభ కనబరచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ తెలిపారు. త్రివేంద్రంలో ఈ నెల18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్టు ఆయన తెలిపారు.

భక్తుల చందన మాలధారణ స్వీకరణ



ముంచంగిపుట్టులో చందన మాలధారణ స్వీకరిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గురువారం 284 మంది భక్తులు సింహాచలం నరసింహస్వామి చందన దీక్ష మాలధారణ స్వీకరించారు. సింహాచలం సింహాద్రి మట్టం గురుస్వామి కసిరెడ్డి సురేంద్రబాబు సహకారంతో స్థానిక గురుస్వాములు దొన్ను, సీతారాంల ఆధ్వర్యంలో చందన మాలధారణ కార్యక్రమం స్థానిక రామాలయంలో జరిగింది. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మాలధారణకు అవసరమైన దుస్తులు, మాలలు అన్ని ఉచితంగా సింహాచలం దేవస్థానం ఉచితంగా అందించారు.అనంతరం మాలల ధరించిన స్వాములు అంతా మండల కేంద్రంలో శ్రీమన్నారాయణ నినాదంతో ఊరేగింపు చేశారు. 23 పంచాయతీల నుంచి అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభం



సుర్మతి గ్రామంలో చెక్‌డ్యామ్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సూరిబాబు

జి.మాడుగుల: మండలంలో సుర్మతి పంచాయతీ కేంద్రంలో గల చెరువులమ్మ తల్లి చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ టి.సూరిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు ఎస్ఎంఐ ఆధ్వర్యంలో రూ.15లక్షలతో చేపట్టనున్నట్టు చెప్పారు. వైస్ సర్పంచ్ వరలక్ష్మి, వార్డు సభ్యులు కోటిబాబు, వెంకన్నపడాల్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

అరకులోయటౌన్: అరకులోయ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అడపా లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హజరు కావాలని ఆయన కోరారు. అన్ని శాఖల అధికారులు విధిగా తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. గైర్హాజరైన ఉద్యోగులపై శాఖపరమైన చర్యలకు కలెక్టర్, సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తామని ఎంపీడీవో లవరాజు చెప్పారు.

రేషన్ సరకులు అందక అవస్థలు



రేషన్ అందజేయాలని కార్డులతో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల పంచాయతీ పరిధి డోమంగిలో రెండు నెలలుగా రేషన్ నిత్యావసర సరకులు అందకపోవడంపై ఆగ్రామ గిరిజనులు గురువారం రేషన్ కార్డులతో ఆందోళన చేపట్టారు. గుంటగన్నెల డీఆర్ డిపో పరిధిలో ఉన్న డోమంగిలో రెండు నెలలుగా కోటా బియ్యం పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత డీఆర్ డిపో నిర్వాహకులను కోటా బియ్యం పంపిణీ చేయాలని విన్నవిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు చెప్పారు. బెదిరింపులకు పాల్పడితే పోలీసు కేసులు పెడతామని నిర్వాహకులు హెచ్చరిస్తున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు. కోటా బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్, జీసీసీ మేనేజర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. డీపో నిర్వాహకుల కుమ్మక్కుతో కోటా బియ్యానికి దూరంగా ఉండి పస్తులు ఉండాల్సి పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా కోటా బియ్యం పంపిణీ చేయాలని లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

వైద్య సేవలపై ఎంపీడీవో సమీక్ష



వైద్యసేవలపై నిర్వహించిన సమీక్షలో సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : గ్రామాల్లో ప్రజలకు, గర్భిణులు, చిన్నారు, విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో పీజీ రామకృష్ణ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై, గర్భిణులు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో పది గ్రామ సచివాలయాలో పనిచేసే సచివాలయం కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించాల్సిందిగా ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజూ ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు



జి.మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశీలిస్తున్న పాడేరు ఎస్‌టీఐ అప్పారావు

జి.మాడుగుల: స్థానిక బస్ స్టేషన్‌ను ప్రయాణికుల సౌకర్యార్థంగా అభివృద్ధికి ఏపీఎస్ ఆర్టీసీ దృష్టి సారిస్తుందని పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ట్రాఫిక్ సూపర్‌వైజర్(ఎస్‌టీఐ) అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. సుర్మతి జంక్షన్ రోడ్డులో గల ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను స్థలాలను ఆయన పరిశీలించారు. ప్రయాణికులు సౌకర్యార్థం బస్సు సర్వీసులు చేపడతామన్నారు. బస్ స్టేషన్ల వద్ద బస్సులు నిలుపుదల చేయాలని, ప్రయాణికులకు ఎప్పటికప్పడు బస్సు సర్వీస్‌ల సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఆర్టీసీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జి.మాడుగుల ఆర్టీసీ సూపర్‌వైజర్ టి.రమణ తదితరలు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 50 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఎటపాక: మండల కేంద్రంలోని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా ముగిసింది.

ఎస్‌పీఆర్ హ్యూమన్ క్యాపిటల్ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా, 50 మంది ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ వరలక్ష్మి, కార్యదర్శి జకరయ్య, కరస్పాండెంట్ రాజశేఖర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని చైర్మన్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ హతీరాం, ప్లేస్‌మెంట్ అధికారి ధనలక్ష్మి తదితరులున్నారు.

గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు

గంగవరం : ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు ,లేబర్ బడ్జెట్ ప్రణాళిక కోసం మండలంలో ఈ నెల 19 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామకృష్ణ, ఉపాధి ఏపీవో ప్రకాశ్ తెలిపారు. 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

చింతూరు: చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాల్లో ఈనెల 13 నుంచి జనవరి 7 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సంబంధిత మండలాల తహసీల్దార్‌ల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని పీవో సూచించారు.

అరకులోయటౌన్: మండలంలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.వి.వి.ప్రసాద్ చెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈనెల 13 నుంచ జనవరి 10వ తేదీ వరకు నిర్వహించే సదస్సుల్లో భూ సమస్యలు, జాయింట్ ఎల్‌పీఎం, వెబ్‌ల్యాండ్ వివరాల సేకరణ తదితర విషయాలను చర్చిస్తారన్నారు. ఇందులో భాగంగా శిరగాం, చొంపి, మాడగడ, సుంకరమెట్ట బొండాం, లోతేరు, ఇరగాయి, గన్నెల, మాదల, పద్మాపురం, పెదలబుడు ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు.

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలో ఈనెల 13 నుంచి జనవర10వ తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ వంతాల మాణిక్యం చెప్పారు. గిరిజనులు ఆయా సదస్సుల్లో పాల్గొని భూ సమస్యలు పరిష్కారించుకోవాలని ఆయన కోరారు.

డుంబ్రిగుడ: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఈనెల 13 నుంచి జనవరి 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డుంబ్రిగుడ ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ చెప్పారు.

కొయ్యూరు: మండలంలోని కొయ్యూరు, మంప, రేవళ్ల, మర్రివాడ, చీడిపాలెం, చింతలపూడి, ఎం.మాకవరం, నల్లగొండ, రావణాపల్లి, అంతాడ, వెలగలపాలెం, బంగారంపేట, డౌనూరు, బట్టపనుకుల, మూలపేట, నడింపాలెం, చిట్టింపాడు, పెదమాకవరం, శరభన్నపాలెం, కొమ్మిక, కంఠారం, బాలారం, రత్నంపేట, కొండగోకిరి, ఎం.భీమవరం, చీడిపాలెం ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించనున్న ట్టు తహసీల్దార్ ప్రసాద్ చెప్పారు.

గంగవరం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

కూనవరం: మండలంలోని 57 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. తాళ్లగూడెం, బొజ్రాయిగూడెం, ఆర్వాయిగూడెం, లింగాపురం, సీతారాంపురం, అభిచర్ల, కూటూరు, రేపాక, భగవాన్‌పురం, గండికొత్తగూడెం, పెదార్కూరు, చినార్కూరు, పంద్రాజుపల్లి, కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం జగ్గవరం, చూచిరేవుల గూడెం, పల్లూరు, గొమ్ముగూడెం, బోదునూరు, కరకగూడెం, పొట్లవాయిగూడెం, టేకుబాక, వెంకటాయపాలెం, కూళ్ళపాడు, కాచవరం, పెదపోలిపాక, చినపోలిపాక, కూనవరంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధికి కృషి



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి, వాటి సాధనపై శిక్షణ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపుతోనే అభివృద్ధిని సాధించవచ్చన్నారు. సీడీపీవో వరహాలమ్మ, బాబుశాల, సుజనకోట, బంగారుమెట్ట, లక్ష్మీపురం, పెదగూడ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చింతపల్లి: పంచాయతీల్లో అభివృద్ధి అంశాలపై మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు.